క్లుప్తంగా

18న బహిరంగ వేలం

ప్రొద్దుటూరు : స్థానిక మైదుకూరు రోడ్డులోని ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న 25 చెట్లను కొట్టుకొని తీసుకుపోవడానికి ఈనెల 18న సాయంత్రం 4 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆర్టీసీ డీఎం మల్లికార్జున రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దాదాపు 20 నుంచి 25 టన్నుల చెట్లకు వేలం వేస్తామని, వేలంలో పాల్గొనేవారు రూ.20వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు పాఠ్యపుస్తకాలు ఇవ్వాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ వద్ద నిరసన వ్యక్తం చేశారు. డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్ రాజ్, ఎస్ఎఫ్ఐ పట్టణాధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ జూనియర్ కాలేజీలు ప్రారంభించి నెలలు గడుస్తున్నా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వలేదన్నారు. పాఠ్యపుస్తకాలు ఇవ్వకుండా విద్యార్థులు ఎలా చదువుకుంటారని ప్రశ్నించారు.

బి.మఠం కోఆప్షన్ సభ్యుడిగా బాలస్వామి

బ్రహ్మంగారిమఠం : బి.మఠం మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడిగా సోమిరెడ్డిపల్లె బాలస్వామిని గురువారం ఎంపీటీసీలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రస్తుతం ఉన్న కోఆప్షన్ సభ్యుడు ముడుమాల పుల్లయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఎన్నికల అధికారులు కోఆప్షన్ సభ్యుడిని ఎన్నుకోవాలని ఆదేశాలు ఇవ్వడంతో మండల ప్రత్యేక అధికారి, ఎన్నికల అధికారిగా వ్యవహరించిన నరసింహారెడ్డి ఎంపీడీఓ కార్యాలయం సభాభవనంలో ఏర్పాటు చేసిన ఎంపీటీసీల సమావేశంలో 11మంది ఎంపీటీసీలు మాజీ సర్పంచ్ బాలస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బాలస్వామిని కోఆప్షన్ సభ్యుడిగా ధ్రువీకరిస్తున్నట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ వెంగమునిరెడ్డి, ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, ఉపాధ్యక్షురాలు సుహాసిని పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రం పరిశీలన

మైదుకూరు : మైదుకూరు మండలం శివపురంలోని రైతు భరోసా కేంద్రాన్ని గురువారం జిల్లా వ్యవసాయశాఖ ప్రత్యేక అధికారి మురళీధర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రం పనితీరును, రైతులకు అందిస్తున్న సేవల గురించి వారు వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రంలోని వ్యవసాయ యంత్ర పరికరాలను పరిశీలించారు. బద్వేలు ఆర్డీఓ ఆకుల వెంకటరమణ, జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, ఏడీఏ కృష్ణమూర్తి, తహసీల్దార్ అనురాధ, మండల వ్యవసాయ అధికారి లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

సాగుకు ముందు విత్తనశుద్ధి తప్పనిసరి

ఖాజీపేట : పంట సాగు చేసే ముందు ప్రతి రైతు విత్తనాలను శుద్ధి చేయాలని జిల్లా వ్యవసాయశాఖ ప్రత్యేక అధికారి మురళీకృష్ణ రైతులకు సూచించారు. పత్తూరు గ్రామంలో రైతుల శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా రైతులకు ఆయన సూచనలు చేశారు. అనంతరం రైతులకు అధికారులు బహుమతులు అందించారు. ఆర్గానిక్ అధికారి శ్రీనివాసరావు, ఏరువాక శాస్త్రవేత్తలు మహేశ్వరి, ఏవో నాగార్జున పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక

ప్రొద్దుటూరు కల్చరల్ : ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి పలువురు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఎంపికయ్యారు. దొరసానిపల్లె జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎం.ఓంసాయి 577 మార్కులు, ఎల్.సాయిశ్రీహర్షిత 567, ఎస్.శ్రీదేవి 565, చిన్ని కృష్ణ 562, వైవీఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్ విద్యార్థిని ఎస్.వెంకటరామశరణ్య 590, రామేశ్వరం మున్సిపల్ హైస్కూల్ విద్యార్థినులు ఎస్.హరిణి 590, పి.సుచరిత 575 మార్కులు పదో తరగతి ఫలితాల్లో సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. పేద విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం పట్ల ఆ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కొండారెడ్డి, కాశీ ప్రసాద్‌రెడ్డి, సత్యబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

చీనీ తోటల సాగులో మెలకువలు తప్పనిసరి

అట్లూరు : చీనీ తోటల సాగులో రైతులు ఎప్పటికప్పుడు మెలకువలు పాటించాలని ఉద్యానవనశాఖ అధికారి జయ భరత్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మండల పరిధిలోని కొండూరు గ్రామ పొలాల్లోని చీనీ తోటల్లోని రైతులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ట్రైకోడెర్మావిరిడి, సుడోమోనాష్ జీవసిలీంద్ర నాశిని ఎరువుల తయారీ విధానంపై రైతులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంఘం చైర్మన్ రొండా మాధవరెడి పాల్గొన్నారు.

ఘన సన్మానం

బద్వేలు అర్బన్ : చిన్నకేశంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తూ ఇటీవల బదిలీపై పోరుమామిళ్ళ మండలం టేకూరుపేట జెడ్పీ హైస్కూల్‌కు బదిలీపై వెళ్ళిన ఎ.వి.రమణయ్య సేవలు మరువలేనివని పాఠశాల నూతన ప్రధానోపాధ్యాయులు ఎం.ఉమాకాంత్ పేర్కొన్నారు. గురువారం స్థానిక చిన్నకేశంపల్లె జెడ్పీ హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో రమణయ్యను ఘనంగా సన్మానించారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు


ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి


అంజనేయనగర్‌లో బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ కుల, మత, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని నాలుగో వార్డులో గురువారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులోని గడ్డంవారిపల్లె, బీసీ కాలనీలో ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వం నుంచి వివిధ సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ హయాంలో అభివృద్ధి గానీ, సంక్షేమ పథకాలు గానీ అర్హులకు అందిన పాపాన పోలేదన్నారు. పక్కా ఇల్లు కానీ, పింఛన్లు కానీ జన్మ భూమి కమిటీలు సిఫారసు చేసిన వారికే అందేవని అన్నారు. వార్డులోని ప్రజలు ప్రస్తావించిన సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, ఆప్కో డైరెక్టర్ ఉదయగిరి వెంకటేష్, వార్డు ఇన్‌చార్జి ఉదయగిరి రామదాసు, మూడో వార్డు కౌన్సిలర్ సుధాకర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి, సర్పంచ్ అన్నలూరు శీను, కూశెట్టి రాయుడు, గోశెట్టి లక్షుమయ్య, చౌక్కా శివ, దండు వెంకటరమణ, రామకృష్ణ, పిల్లి నాగయ్య, సన్న శ్రీనురావు, మున్సిపల్ ఏఈ నిరంజన్ రెడ్డి, హౌసింగ్ ఏఈ బ్రహ్మానందరెడ్డి, ఎంఈఓ పద్మలత తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమం జగనన్నతోనే సాధ్యం
- ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : కులం, మతం, పార్టీ చూడకుండా అర్హత ఉన్న ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తూ అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో గల అంజనేయనగర్‌లో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి వార్డులోని ప్రతి గడపను సందర్శించారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను, ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ ఏ ఒక్క సంక్షేమ పథకంలో కోత విధించకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మేనిఫెస్టోను ఒక భగవద్గీతగా, ఖురాన్‌గా, బైబిల్‌గా భావించి అందులో పొందుపరిచిన ప్రతి హామీని ముఖ్యమంత్రి అమలు చేస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను సైతం అమలు చేస్తూ పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి అని అన్నారు. పేదల అభ్యున్నతికి నిరంతరం పరితపించే ప్రజా నాయకుడు వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, సివిల్‌సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ సుందర్‌రామిరెడ్డి, గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారుశీనయ్య, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, వార్డు కౌన్సిలర్ చెవుల వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింగమాలవెంకటేశ్వర్లు, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు, మున్సిపల్ కమీషనర్ కె.వి.కృష్ణారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

చిన్నగురువళూరులో వైభవంగా ఆలయ వార్షికోత్సవం

చాపాడు : మండల పరిధిలోని చిన్నగురువళూరులో గురువారం శ్రీ అభయాంజనేయ స్వామి, షిర్డీ సాయినాథ స్వాముల వారి దేవస్థాన 8వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సీనియర్స్ విభాగంలో నిర్వహించిన బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ప్రారంభించారు. ఈ పోటీల్లో ప్రొద్దుటూరు మండలం చౌటపల్లెకు చెందిన మార్తల చంద్ర ఓబుళరెడ్డి ఎద్దులు 2607 అడుగులతో ప్రథమ స్థానంలో నిలవగా, వల్లూరు మండలం బాలుగారిపల్లెకు చెందిన ఇందిరెడ్డి రమణారెడ్డి ఎద్దులు 2043 అడుగులతో ద్వితీయ, వీరపునాయుడుపల్లె మండలం కీర్తిపల్లెకు చెందిన భరత్‌కుమార్ ఎద్దులు 2023 అడుగులతో తృతీయ స్థానంలో గెలుపొందాయి. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లక్షుమయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

టవర్ క్లాక్ నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పట్టణ నడిబొడ్డున ఉన్న శివాలయం సర్కిల్‌లో టవర్ క్లాక్ నిర్మించేందుకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి గురువారం సాయంత్రం స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట అనుడ చైర్మన్ గురుమోహన్, వైస్ చైర్మన్ నందన్ ఓబులేసు ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మీడియాతో మాట్లాడుతూ పట్టణంలో సింబాలిక్‌గా ఉండేందుకు వినూత్నంగా టవర్ క్లాక్ నిర్మించాలని తన వ్యక్తిగత అభిప్రాయమని అన్నారు. పలువురితో చర్చించిన మేరకు ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. సుమారు రూ.2కోట్లు వ్యయంతో టవర్ క్లాక్‌తోపాటు చుట్టు పార్కు తరహాలో స్థలాన్ని తయారు చేస్తామన్నారు. టవర్ క్లాక్ నిర్మాణానికి అనుడ నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. త్వరలో టవర్ క్లాక్ నిర్మాణానికి సంబంధించి శంకుస్థాపన చేస్తామని చెప్పారు.


భూమి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమి పూజ

ప్రొద్దుటూరు : 15వ వార్డు బాలాజీనగర్-2లో రూ.20లక్షలతో నిర్మించనున్న సిమెంటు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి గురువారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, కౌన్సిలర్ వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రెడ్ల ఐక్యత సభను జయప్రదం చేయండి

ప్రొద్దుటూరు : ఆగస్టు 6న విజయవాడలోని భవానిపురంలో కొండవీటి రెడ్డి భవనంలో నిర్వహించనున్న రెడ్ల ఐక్యత సభను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు గంగులకుంట నరేష్ కుమార్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన ప్రొద్దుటూరు పట్టణంలోని పలువురు ముఖ్యులను కలిశారు. రెడ్డి కార్పొరేషన్ ద్వారా యువతకు సబ్సిడీ రుణాలు, వ్యవసాయానికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయడంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని గోపాల్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నారుపల్లె జగన్‌మోహన్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, జీవనజ్యోతి, టీవీఆర్ కరస్పాండెంట్లు అమరనాథ్‌రెడ్డి, వైవీ రమణారెడ్డి పాల్గొన్నారు.

నోటుపుస్తకాలు పంపిణీ

కాశినాయన : మండలంలోని చెన్నవరం, కొండపేట, బాలరాజుపల్లె, కె.ఎస్.కొట్టాల, కోడిగుడ్లపాడు, చిన్నాయపల్లె, వడ్డమాను, పిట్టిగుంట, కొండ్రాజుపల్లె ఎంపీపీ, ఆర్సీఎం పాఠశాలల్లో చదువుతున్న 500 మంది విద్యార్థులకు ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు చిత్తాతోమాస్‌రెడ్డి, డాక్టర్ గీతల ఆధ్వర్యంలో వారి ప్రతినిధి ఎల్.ప్రసాద్‌రెడ్డి గురువారం 1500 నోటుపుస్తకాలను పంపిణీ చేశారు.

పాడి రైతు పశుగ్రాసం వేసుకోవాలి

రాజుపాళెం : పాడి రైతులు ప్రతి ఎకరంలో 10 సెంట్లు పశుగ్రాసం వేసుకోవాలని గాదెగూడూరు పశువైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఈనెల 7 నుంచి 14వ తేదీ వరకు పశుగ్రాస వారోత్సవాలను నిర్వహిస్తున్నామని, గురువారం కూలూరు, గాదెగూడూరు గ్రామాల్లో నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు పశుగ్రాసం వేయడం వలన పాల ఉత్పత్తి పెరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్ ఆరీఫ్, వెటర్నరీ అసిస్టెంట్ అశోక్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులను త్వరగా పూర్తి చేయాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రభుత్వ పాఠశాలలలో రెండో విడత నాడు-నేడు పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంఈఓలు సావిత్రమ్మ, శోభారాణి తెలిపారు. గురువారం అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రైవేటు పాఠశాలల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాడు-నేడు పనుల ఇన్‌వాయిస్ బిల్లులు పెండింగ్‌లో ఉంటే వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. జేవీకే కిట్లకు విద్యార్థుల తల్లిదండ్రులతో వంద శాతం బయోమెట్రిక్ చేయాలన్నారు. 2022-23 సంవత్సరం ఉపాధ్యాయులు, విద్యార్థుల సమాచారాన్ని యుడైస్‌లో నమోదు చేయాలని సూచించారు. శుక్రవారం లోపు విద్యార్థుల సమాచారం నమోదు చేయకపోతే డీఈఓకు వివరణ ఇవ్వాలన్నారు. పాఠశాలల పరిధిలో డ్రాపౌట్ల వివరాలను గుర్తించాలన్నారు. యుడైస్‌లో సమాచారం ఎలా నమోదు చేయాలో విద్యాశాఖ సిబ్బంది చేసి చూపించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రైవేటు పాఠశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.



▸▸ చదువురాని మహిళకు చేయూత

ఇక్కడ మహిళ నుంచి వేలి ముద్రలు తీసుకుంటున్న వలంటీరు పేరు గోనా సౌందర్య. మండలంలోని అన్నవరం గ్రామానికి చెందిన శ్రీపతి వరకుమారి అనే మహిళ 45 ఏళ్లు దాటినా వైఎస్సార్ చేయూత పథకం కోసం దరఖాస్తు చేసుకోకపోవడం వలంటీరు గుర్తించింది. ఇంటింటి సర్వేలో భాగంగా ఈమె ఆధార్ కార్డును చూసిన వలంటీరు సౌందర్య వైఎస్సార్ చేయూత పథకం కోసం దరఖాస్తు చేయించింది. దీంతో వైఎస్సార్ చేయూత ద్వారా ప్రభుత్వం నుంచి రూ.18,750 డబ్బు సౌందర్య ఖాతాలో జమ అయింది. ఈ ఏడాది రెండోసారి పథకం వర్తించనుంది. - చాపాడు



వలంటీరు కృషి వల్లే నాకు ప్రభుత్వ సాయం



మా కాలనీలో ఉన్న వలంటీరు సౌందర్య సర్వేలో భాగంగా మా ఇంటికి వచ్చింది. నా ఆధార్ కార్డు చూసి నాకు 45 ఏళ్లుగా గుర్తించింది. చేయూత పథకానికి దరఖాస్తు చేసుకుంటే డబ్బు వస్తుందని చెప్పి స్వయంగా సచివాలయంలో దరఖాస్తు చేయించింది. గతేడాది రూ.18,750 డబ్బు బ్యాంకులో పడ్డాయి. వలంటీరు కృషి వల్లే నాకు ప్రభుత్వ సాయం అందింది.
- శ్రీపతి వరకుమారి, అన్నవరం, చాపాడు మండలం

▸▸ దివ్యాంగుల పింఛను ఇప్పించి ఆదుకున్నాడు

ఇతడి పేరు సంజీవరాయుడు. దువ్వూరు మండలం ఏకోపల్లె గ్రామంలో వలంటీరుగా పనిచేస్తున్నాడు. ఇతడు గ్రామంలో గద్ద సత్యకుమార్ అనే వ్యక్తి పుట్టుకతోనే దివ్యాంగుడు అని తెలుసుకున్నాడు. అయిప్పటికీ అతడికి గత ప్రభుత్వాలు పింఛను మంజూరు చేయకపోవడం గుర్తించాడు. సత్యకుమార్‌ను కలసి పింఛను కోసం దరఖాస్తు చేయించాడు. ప్రస్తుతం సత్యకుమార్‌కు పింఛను మంజూరై నెలకు రూ.3వేలు దివ్యాంగుల పింఛను అందుతోంది. - దువ్వూరు



వలంటీరుకు రుణపడి ఉంటా



నా పేరు గద్ద సత్యకుమార్. నేను పుట్టుకతోనే దివ్యాంగుడిని. గత ప్రభుత్వంలో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నా రాలేదు. అధికారులకు, నాయకులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. మా వలంటీర్ సంజీవరాయుడు నా పరిస్థితి చూసి ఇంటి వద్దకు వచ్చి సర్టిఫికెట్లు తీసుకెళ్లి పింఛనుకు దరఖాస్తు చేశారు. ప్రభుత్వం దివ్యాంగుల పింఛను మంజూరు చేయడంతో నాకు ఇప్పుడు నెలకు రూ.3వేలు అందుతోంది. నాకు పింఛను ఇప్పించి సాయపడ్డ వలంటీరు సంజీవరాయుడికి రుణపడిఉంటా. - గద్ద సత్యకుమార్ ఏకోపల్లె, దువ్వూరు మండలం

▸▸ ఆపదలో అండగా.. ఆస్పత్రికి వెళ్లి పింఛను అందజేత

ఈ చిత్రంలో పింఛను అందిస్తున్న వ్యక్తి పేరు ప్రశాంత్. రాజుపాళెం మండలంలోని గోపాయపల్లె గ్రామ వలంటీరుగా గత నాలుగేళ్లుగా సేవలు అందిస్తున్నాడు. కరోనా విజృంభించిన సమయంలోనూ తన పరిధిలోని 50 కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమాన్ని అందిస్తూ ఆయా కుటుంబాలకు అన్ని విషయాల్లో చేయూతగా ఉన్నాడు. కాగా తన పరిధిలోని రేపల్లె వెంకటసుబ్బమ్మ ఆరోగ్యం బాగాలేక పోవడంతో వారం రోజులుగా నంద్యాలలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో వలంటీరు ప్రశాంత్ వెంకటసుబ్బమ్మకు పింఛను డబ్బులు అందిస్తే ఖర్చులకైనా వస్తుందని భావించి తన సొంత ఖర్చులతో ఆస్పత్రికి వెళ్లి వెంకటసుబ్బమ్మ కోడలు అంజనమ్మకు డబ్బులు అందించి పలువురి ప్రశంసలు అందుకున్నాడు. - రాజుపాళెం



కష్టకాలంలో ఆదుకున్నాడు

ఉన్న ఫలంగా మా అత్త వెంకటసుబ్బమ్మకు ఆరోగ్యం బాగ లేకుండా పోయింది. నంద్యాలలోని ఓ ఆస్పత్రిలో చేర్చాం. మా వలంటీరు ప్రశాంత్ ఆస్పత్రికి వచ్చి తలుపు తట్టి పింఛను డబ్బులు అందజేసి ఆర్థికంగా ఆదుకున్నాడు. ఆ సమయంలో వలంటీర్ చేసిన సేవలు మరువలేనివి.
- అంజనమ్మ, గోపాయపల్లె గ్రామం, రాజుపాళెం మండలం

మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి


ప్రొద్దుటూరు : కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ శేఖర్ యాదవ్


దువ్వూరు : సర్టిఫికెట్ అందిస్తున్న తహసీల్దార్ రమాకుమారి, సర్పంచ్ రోజారమణి


అట్లూరు : ధృవీకరణపత్రాలను అందజేస్తున్న డీఎల్‌డీఏ చైర్మన్


బి.కోడూరు : లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న మండల ఉపాధ్యక్షుడు, సర్పంచ్

ప్రొద్దుటూరు : ముస్లిం మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, మంచి చేసిన ప్రభుత్వాన్ని గుర్తించి మళ్లీ ఎన్నోకోవాల్సిన అవసరం అందరిపై ఉందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 27వ సచివాలయంలో గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ముఖ్యమంత్రి జగన్ ప్రజల కోసమే పనిచేస్తున్నారని చెప్పారు. పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు చెల్లిస్తున్నారన్నారు. అనంతరం ఎమ్మెల్యే లబ్ధిదారులకు సరిఫికెట్లు అందజేశారు. 25వ వార్డు ఇన్‌చార్జి షేక్ నూరి, 22వ వార్డు ఇన్‌చార్జి హిదాయత్, 23వ వార్డు ఇన్‌చార్జి వడ్ల దాదాపీర్, వార్డు సచివాలయాల ఇన్‌చార్జి కాకర్ల నాగేషారెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య పాల్గొన్నారు.

వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సేవలందించాలి

ప్రొద్దుటూరు వలంటీర్లు ఇంటింటికి వెళ్లి సేవలు అందించాలని ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ సూచించారు. సోములవారిపల్లె గ్రామ పంచాయతీ ఈశ్వరరెడ్డినగర్ సచివాలయం-2లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. లబ్ధిదారులకు సరిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మోపూరు ప్రశాంతి, ఉపసర్పంచ్ కృష్ణారెడ్డి, ఎంపీటీసీలు గోటూరు బాలగుర్రమ్మ వెంకటేష్, పల్లా లక్ష్మీదేవి, తహసీల్దార్ నజీర్ అహ్మద్, పంచాయతీ కార్యదర్శి హరినాథ్, వలంటీర్లు పాల్గొన్నారు.

వచ్చే జనవరి నుంచి రూ.3 వేలు పింఛను

చాపాడు : వచ్చే ఏడాది జనవరి నెల నుంచి ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ పింఛను రూ.3వేలకు పెంచుతుందని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని అన్నవరం గ్రామ గ్రామ సచివాలయం వద్ద గురువారం జగనన్న గ్రామ సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎమ్మెల్యే లబ్ధిదారులకు ధృవీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లక్షుమయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ రామోహన్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి సురేష్‌రెడ్డి, తహసీల్దారు సుభానీ, ఎంపీడీఓ రాధాకృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా జనరల్ సెక్రెటరీ రవికుమార్, నాయకులు పాల్గొన్నారు.

దువ్వూరు : మండల పరిధిలోని జిల్లెల్ల సచివాలయ పరిధిలోని వెంకుపల్లెలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రమాకుమారి దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లను అందించారు. సర్పంచ్ బోదనపు రోజారమణి, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

గోపవరం : మండలంలోని రాచాయపేట సచివాలయం వద్ద సర్పంచ్ నాగేంద్ర అధ్యక్షతన ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇంకా అర్హత ఉండి సంక్షేమ పథకాలు రాని వారికి ప్రజలకు అవసరమయ్యే వివిధ రకాల సర్టిఫికెట్లను సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికి వెళ్ళి సర్వే నిర్వహించి ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం 550 వివిధ సర్టిఫికెట్లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి నాగరాజ, ఎంపీడీఓ హరినారాయణ, తహసీల్దారు దామోదర్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మల్లికార్జునరెడ్డి, సచివాలయ కన్వీనర్ పుల్లయ్య, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అట్లూరులో..

అట్లూరు : మండల పరిధిలోని కుంభగిరి సచివాలయ ఆవరణలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. మండల కన్వీనరు ముడమాల ప్రభాకర్‌రెడ్డి, జిల్లా పశుగణాభివృద్ధి సంఘం చైర్మన్ రొండా మాధవరెడ్డి, అటవీశాఖ కార్పొరేషన్ డైరెక్టరు రొండా మల్లికార్జునరెడ్డి, మండల సచివాలయాల కన్వీనరు మణ్యం మల్లికార్జునరెడ్డి 466 సరిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి అందూరు రామకృష్ణారెడ్డి, కుంబగిరి ఎంపీటీసీ గంగయ్య, సర్పంచ్ గంగమ్మ, మండల నాయకులు రెడ్డెయ్య, రాజారెడ్డి, మనోహర్‌రెడ్డి, తహసీల్దారు శ్రీవాణి, ఎంపీడీఓ సుజాతమ్మ పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం : మండలంలోని చౌదరవారిపల్లెలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి చేతులమీదుగా లబ్ధిదారులకు 25 సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు కూనపులి సుహాసిని,ఎంపీటీసీ యల్లటూరి ఈశ్వర్‌రెడ్డి, గ్రామ సచివాలయ మండల కన్వీనర్ రాజానాయుడు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : అక్కలరెడ్డిపల్లె సచివాలయంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి పాల్గొని మాట్లాడారు. అనంతరం 285 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. సభలో జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, మండల ఉపాధ్యక్షుడు సిఎం బాషా, చెన్ను రాజశేఖర్, ఎంపీటీసీ రవి, ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్, తహసీల్దారు గంగయ్య, పాల్గొన్నారు.

బి.కోడూరులో..

బి.కోడూరు : మండలంలోని మేకవారిపల్లె గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. అనంతరం సచివాలయం పరిధిలో 160 మంది దరఖాస్తు చేసుకోగా 142 మందికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీనరసారెడ్డి, ఉపసర్పంచ్ శివారెడ్డి, వాటర్‌షెడ్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, మండల జేసీఎస్ చైర్మన్ నరసింహారెడ్డి, ఏడీఏ మురళీధర్‌రెడ్డి, తహసీల్దారు విద్యాసాగర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ రమణయ్య పాల్గొన్నారు.

కలసపాడు : మండలంలోని బ్రాహ్మణపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధ పాల్గొనగా స్థానిక సర్పంచ్ సూదారామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఏ ఇంటి గడపకు వెళ్ళినా తాము లబ్ధిపొందిన పథకాల గురించి లబ్ధిదారులు సంతోషంగా వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అంకనగురివిరెడ్డి, సుదర్శన్, పురుషోత్తంరెడ్డి, చిత్తారాజశేఖర్‌రెడ్డి, నారాయణయాదవ్, మండల ఉపాధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, పులివీరారెడ్డి, షరీఫ్, అమర్‌నాథ్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, బాలిరెడ్డి, ఎంపీడీఓ మహబూబ్‌బీ, నరసింహారెడ్డి, సింగరయ్య పాల్గొన్నారు.

అనుమానితులు బైండోవర్

పోరుమామిళ్ల : మండలంలోని టేకూరుపేట, కవలకుంట్ల, కప్పలపల్లె గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తున్నట్లు అనుమానం ఉన్న 12 మందిని గురువారం ఎస్ఐ మల్లికార్జునరెడ్డి స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం తహసీల్దారు వద్ద హాజరు పరచి బైండోవర్ చేశారు.

పర్యావరణాన్ని కాపాడటం అందరి బాధ్యత

ప్రొద్దుటూరు క్రైం : పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరిదని ప్రొద్దుటూరు పట్టణ సీఐలు రాజారెడ్డి, ఇబ్రహీం, నారాయణయాదవ్ తెలిపారు. బొల్లవరంలోని శ్రీచైతన్య స్కూల్‌లో ఏజీఎం నాగిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం హరిత భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐలు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వారి పుట్టినరోజు నాడు ఒక మొక్కను నాటాలన్నారు. మొక్కలను పెంచి పెద్ద చేస్తే అవి మనల్ని కాపాడతాయని తెలిపారు. అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలను నాటారు. ప్రిన్సిపల్ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

అట్లూరు : హాస్టల్ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి బ్రహ్మయ్య పేర్కొన్నారు. స్థానిక బీసీ హాస్టల్‌ను ఆయన గురువారం తనిఖీ చేశారు. వార్డెన్ రామలింగేశ్వరరెడ్డి నీటి సౌకర్యం తక్కువగా ఉందని అందుకు నిధులు లేవని తెలపడంతో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి నిధులను మంజూరు చేయిస్తానని తెలిపారు.

త్వరగా ఇళ్లు నిర్మించేందుకు సహకరించండి

ప్రొద్దుటూరు : జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించేందుకు సహకరించాలని మెప్మా పీడీ సురేష్ రెడ్డి తెలిపారు. ఆయన గురువారం మున్సిపల్ కార్యాలయంలో సీఓలతో సమావేశం నిర్వహించారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ఇప్పటి వరకు 11,116 ఇళ్లకు డబ్బు చెల్లించారని, ఇంకా 2వేల మంది చెల్లించాల్సి ఉందన్నారు. త్వరగా లబ్ధిదారులతో డిపాజిట్ కట్టించి పురోగతి సాధించాలన్నారు.